తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 96 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ మంగళవారం 12 -11-2024 వెల: 5/రూ -



## తెలంగాణ ఏమీ కోల్పోలేదు

**ఓ నలుగురి ఉద్యోగాలు మాత్రమే పోయాయి**

**కెసిఆర్ వ్యాఖ్యలపై సిఎం రేవంత్ సెటైర్లు**

**ఏఎంవీఐలకు నియామక పత్రాల అందజేత**

హైదరాబాద్: గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏమీ కలో÷-పోలేదని, ఓ కుటుంబంలో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ఖైరతాబాద్‌లో ఏఎంవీఐలకు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు గతంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ బాట పట్టారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ పోరాట నేపథ్యమే ఉద్యోగాలని అన్నారు. తెలంగాణలో కులగణన మొదలైంది.

2లో

**రూ.2.94 లక్షల కోట్లతో పయ్యావుల పద్దు**

# 'సూపర్ సిక్స్' అమలుకు నిధులు

**రాష్ట్ర బడ్జెట్‌లో సమతుల్యత..అసాధారణ 'ఆలస్యం'తో పూర్తిస్థాయి బడ్జెట్**

- ఆదాయం రూ.2.01 లక్షల కోట్లుగా అంచనా
- అప్పులు రూ.93,253 కోట్లు తేవాల్సిందే
- 30 వేల కోట్ల గ్రాంటు వస్తుందని లెక్కలు
- బడ్జెట్‌లో ఆచితూచి అంకెల కూర్పు
- ఆదాయం ఆధారంగా పరిమాణం కుదింపు
- ఆర్థిక పునరుజ్జీవమే మా లక్ష్యం
- వైసీపీ పాలనలో పతనం అంచుల్లోకి రాష్ట్రం
- వనరుల దోపిడీ, నిధుల దుర్వినియోగంతో అధోగతి.. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి కేశవ్ పద్దు రూ.2,94,427 కోట్లు
- మొత్తం బడ్జెట్ రూ.2,94,427.25 కోట్లు
- రెవెన్యూ వ్యయం రూ.2.34 లక్షల కోట్లు
- మూలధన వ్యయం రూ.32,712 కోట్లు
- ద్రవ్యలోటు రూ.68,743 కోట్లు
- జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు 4.19శాతం
- జీఎస్‌డీపీలో ద్రవ్యలోటు 2.12శాతం



**కూటమి సర్కారు తన తొట్టతొలి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, ఆర్థిక సంవత్సరం మొదలైన ఎనిమిది నెలల తర్వాత... మరో నాలుగు నెలలు మాత్రమే మిగిలిఉండగా రూ.2.94 లక్షల కోట్లతో 2024-25 పద్దును రూపొందించింది.**

అమరావతి: కూటమి సర్కారు తన తొట్టతొలి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, ఆర్థిక సంవత్సరం మొదలైన ఎనిమిది నెలల తర్వాత... మరో నాలుగు నెలలు మాత్రమే మిగిలిఉండగా రూ.2.94 లక్షల కోట్లతో 2024-25 పద్దును రూపొందించింది. ఇప్పటిదాకా ఓటాన్ అకౌంట్‌కే పరిమితం కాగా... ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం శాసనసభకు పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పించారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో బడ్జెట్‌కు ఆన్‌లైన్ ద్వారా ఆయన ఆమోదం పొందారు.

2లో

## భారత్‌కూ ఐరన్ డోమ్!



**త్వరలోనే దేశానికి పాంట్‌సిర్ గగనతల రక్షణ వ్యవస్థ**

**రష్యా కంపెనీతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కీలక ఒప్పందం**

న్యూఢిల్లీ, నవంబరు 11: భారత గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా కీలక ముందడుగు పడింది. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ తరహాలో... రష్యా గగనతలానికి రక్షణ వలయంగా

2లో



## సీజేఐగా జస్టిస్ ఖన్నా

**ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము**

**శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, ఖర్గే**

**వచ్చే ఏడాది మే 13వరకు పదవిలో ఖన్నా**

**తొలిరోజే 45 కేసుల విచారణ**

న్యూఢిల్లీ: భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని అశోకా హాల్లో ద్రౌపది ముర్ము, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణం చేయించారు.

## అమృత్ టెండర్లలో సీఎం భారీ అవినీతి!: కేటీఆర్

**ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధన ఉల్లంఘనకు పాల్పడ్డారు: కేటీఆర్**



**బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి రూ.1,137 కోట్ల పనులను అప్పగించారు.. విచారణ జరిపి టెండర్లను రద్దు చేయాలి**

**రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి**

**కేంద్ర మంత్రి ఖట్టర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫిర్యాదు**

న్యూఢిల్లీ: అమృత్ పథకం టెండర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీస్థాయిలో అవినీతికి పాల్పడ్డారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధనను ఉల్లంఘించి తన బావమరిది సృజన్ రెడ్డికి చెందిన కంపెనీకి రూ.1,137 కోట్ల విలువ చేసే పనులను అప్పగించారన్నారు. కేవలం సీఎం బావమరిది అనే ఒకే ఒక్క అర్హతతో ఇంత పెద్దఎత్తున పనులను కట్టబెట్టారని మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శలు సంధించారు.

- మిగతా 2వ పేజీలో

## వైఫల్యాలు, మోసాలపై నిలదీస్తామని పాలక పక్షానికి భయం: వైఎస్ జగన్

- పార్టీ ప్రజాప్రతినిధులతో భేటీలో వైఎస్ జగన్ ధ్వజం
- అందుకే 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీని ప్రతిపక్షంగా గుర్తించడం లేదు.. ప్రభుత్వ వైఫల్యాలు, మండలిలో ఎమ్మెల్సీలు ప్రజాగళాన్ని గట్టిగా వినిపించాలి..
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జగన్ దిశానిర్దేశం



2లో

## అన్నదాతకు అగ్రతాంబూలం

- వ్యవసాయం మరింత పరిపుష్టం.. మళ్లీ పావలా వడ్డీ రుణాలు
- సాగు బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు
- వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187.68 కోట్లు
- చిన్న, సన్నకారు రైతులకు 50% సబ్సిడీపై యంత్రాలు
- 2 సీజన్లకూ పంటల బీమా.. కిసాన్ డ్రోన్లతో నవశకానికి నాంది

అమరావతి: బడ్జెట్‌లో అన్నదాతకు అగ్రతాంబూలం ఇచ్చామని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరైన వ్యవసాయ రంగాన్ని మరింత పరిపుష్టం చేసే దిశగా కేటాయింపులు చేశామన్నారు.



# అమృత్ టెండర్లలో సీఎం భారీ అవినీతి!: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు సోమవారం రాత్రి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదరరావు, సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపీలు మాలోత్ కవిత, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి కేటీఆర్ కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కలిసి అమృత్ టెండర్లలో జరిగిన స్కాంపై ఫిర్యాదు చేశారు. అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి చెందిన కంపెనీ ‘శోధా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్’రూ.1,137 కోట్ల పనులను దక్కించుకుందని కేటీఆర్ ఆరోపించారు. 2021%-%22 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 2.20 కోట్ల లాభాన్ని చూపించిన కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు ఎలా కట్టబెడతారని ఫిర్యాదులో ప్రశ్నించారు. ఏమాత్రం అనుభవం, అర్హత లేని కంపెనీకి ఇన్ని కోట్ల పనులు అప్పగించారంటే తెర వెనుక భారీ అవినీతి బాగోతం నడిచిందనే విషయం అర్థమవుతోందని చెప్పారు. ఈ వ్యవహారంలో స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అవినీతికి పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి బావమరిది కంపెనీ కావటంతోనే ఇండియన్ హ్యూమ్ పైప్స్ లిమిటెడ్ సంస్థ మొత్తం ప్రాజెక్ట్‌లో 80 శాతం పనులను శోధా సంస్థకు అప్పగించిందన్నారు. ఈ టెండర్లలో సీఎం బావమరిది ప్రధాన భాగస్వామి అని తెలిపారు. ఆ నిబంధన కింద వేటువేయొచ్చు.. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా.. వారిపై వేటు వేయొచ్చని కేటీఆర్ చెప్పారు. ఇందుకు సంబంధించి పలు కేసులను కూడా ఆయన ఉదహరించారు. జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్ గనుల కేటాయింపు, 1983లో బిహారిలాల్ దోబ్రే వర్సెస్ రోషన్ లాల్ దోబ్రే కేసు, 2005లో శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు వర్సెస్ వైరిచెర్ల ప్రదీప్ కుమార్ దేవ్ కేసు, 2001లో జయా బచ్చన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు, 2003లో దివ్య ప్రకాష్ వర్సెస్ కులతార్ చంద్ రాణా కేసులను కేటీఆర్ కేంద్రమంత్రికి వివరించారు. 2014లో హరియాణాలో సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా కేసులనూ ప్రస్తావించారు. ముఖ్యమంత్రి అవినీతిని అరికట్టాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని చెప్పారు. టెండర్లలో చట్టవిరుద్ధంగా జరిగిన కేటాయింపులు, అక్రమ ఒప్పందాలపై విచారణ జరపాలని, అక్రమాలు నిజమని తేలితే టెండర్లను రద్దు చేసి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి ఖట్టర్‌తో భేటీ నిమిత్తం కేటీఆర్ ఢిల్లీకి రాగా.. కేసుల నుంచి తప్పించుకోవడానికే ఆయన ఢిల్లీకి వెళ్లారంటూ రాష్ట్ర మంత్రులు ఆరోపించారు. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి కేటీఆర్ తన ‘ఎక్స్’ఖాతా ద్వారా స్పందించారు. ‘జస్ట్ ఇప్పుడే ఢిల్లీలో ల్యాండ్ అయ్యాను. ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రకంపనలు వస్తున్నాయని విన్నాను. అప్పుడు వణికిపోతే ఎలా?’అంటూ పోస్ట్ చేశారు.

# భారత్‌కూ ఐరన్ డోమ్!

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తున్న అత్యాధునిక పాంట్‌సిర్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్-గన్ వ్యవస్థ త్వరలోనే భారత్‌కు కూడా అందుబాటులోకి రానుంది. ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కోసం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్).. రష్యాకు చెందిన ఆయుధ ఎగుమతిదారు రోసోబొరోనెక్స్‌పోర్ట్ (ఆర్‌వోఈ)తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గోవాలో జరిగిన ఇండియా-రష్యా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ (ఐఆర్‌ఐజీసీ) సబ్ గ్రూప్ సమావేశంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత్, రష్యా మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని ఈ భాగస్వామ్యం నొక్కిచెబుతోంది.

**పాంట్‌సిర్ రక్షణ వ్యవస్థ సామర్థ్యం**

పాంట్‌సిర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అనేది విమానాలు, డ్రోన్లు, క్షిపణులతోపాటు సైనిక స్థావరాలకు గగనతలం నుంచి వచ్చే ముప్పుని సమర్థవంతంగా ఎదుర్కొనడానికి రూపొందించిన అత్యాధునిక మొబైల్ రక్షణ వ్యవస్థ. దీనిలో ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగిన స్వల్ప, మధ్య శ్రేణి క్షిపణులు ఉంటాయి. అలాగే డ్యూయల్ 30ఎంఎం ఆటోమేటిక్ ఫిరంగులు బహుళ అంచెల రక్షణను అందిస్తాయి. అత్యాధునిక రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ ట్రాకింగ్‌ను కలిగి ఉన్న పాంట్‌సిర్ వ్యవస్థ 36 కిలోమీటర్ల దూరంలో, 15 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగిరే లక్ష్యాలను గుర్తించి అలవోకగా ఛేదించగలదు. వేగంగా దూసుకొచ్చే శత్రు ఆయుధాలను అంతే వేగంగా ప్రతిస్పందించి తిప్పికొట్టగలదు. రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించాలనే భారత్ లక్ష్యానికి అనుగుణంగా.. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, రోసోబొరోనెక్స్‌పోర్ట్ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా ఉత్పత్తి, సాంకేతికత బదిలీ, పాంట్‌సిర్ వేరియంట్ల ఉమ్మడి అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించాలని బీడీఎల్, ఆర్‌వోఈ లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**ఈ నెలాఖరులో రష్యా నుంచి మరో యుద్ధనౌక**

రష్యాలో నిర్మిస్తున్న రెండు గైడెడ్ క్షిపణి వ్యవస్థ కలిగిన యుద్ధనౌకల్లో మొదటిది ఈ నెలాఖరులోగా భారత్‌కు చేరనుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వీటి డెలివరీ ఆలస్యమైంది. అలాగే.. రష్యా అందజేయాల్సిన మిగిలిన రెండు ‘ఎస్-400’ ట్రయంఫ్ గగనతల రక్షణ వ్యవస్థలు 2026 నాటికి భారత్‌కు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు 4,000 టన్నుల బరువున్న యుద్ధనౌకను కొన్ని నెలలుగా కలినిన్ గ్రాడ్‌లోని యాంటార్ షిప్‌యార్డులో మోహరించారు. డిసెంబరు మొదటి వారంలో రష్యాను సందర్శించనున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ యుద్ధనౌకను అప్పగించనున్నారు. భారత్ దీన్ని ఐఎన్‌ఎస్ తుశీల్‌గా ప్రారంభించనుంది.

# అన్నదాతకు అగ్రతాంబూలం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం శాసనసభలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. ‘గత ప్రభుత్వం భూసార పరీక్షలను విస్మరించింది. సూక్ష్మపోషకాలు, రాయితీపై వ్యక్తిగత పనిముట్లు ఇవ్వలేదు. రబీలో పంట నష్టపోయిన రైతులకు బీమా అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి 100 రోజుల్లోనే భూసార పత్రాలు, పొలం పిలుస్తోంది, ఫార్మర్స్ రిజిస్ట్రీ, డ్రోన్ల వినియోగం, వరద సాయం వంటి కార్యక్రమాలతో రైతులకు అండగా నిలిచాం. సాగు రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఏపీ సాగుదారుల హక్కు చట్టం-2024 తెస్తాం. 50% సబ్సిడీపై ఈ ఏడాది సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రాలు అందిస్తాం. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187.68 కోట్లు ప్రతిపాదించాం’ అని చెప్పారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి రూ.లక్షా66 వేల కోట్లు, అనుబంధ రంగాలకు రూ.98 వేల కోట్ల రుణాలు అందిస్తామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు వెన్నుదన్నుగా ఉన్న పావలా వడ్డీ రుణాలను జగన్ సర్కారు ఎత్తేసింది. ఇప్పుడు మళ్లీ పావలా వడ్డీ రుణాలకు వడ్డీ రాయితీ అమలు చేస్తామని అచ్చెన్నాయుడు ప్రకటించారు.

# ‘సూపర్ సిక్స్’ అమలుకు నిధులు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం అసెంబ్లీలో మంత్రి పయ్యావుల కేశవ్, మండలిలో మంత్రి కొల్లు రవీంద్ర... వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు, మండలిలో మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి... రెండింటికీ సమప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్ రూపొందించారు. ‘సూపర్ 6’ పథకాలకు నిధులు కేటాయించారు. పెన్షన్లు, దీపం 2.0, అన్న క్యాంటీన్లు, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు ప్రాధాన్యం ఇచ్చారు.రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ ఇస్తున్న అప్పును రాష్ట్ర బడ్జెట్లో అప్పుల ఖాతాలోనే చూపించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమరావతి అప్పు కింద రూ.3,000 కోట్లను అంచనా వేశారు. కేంద్రం నుంచి వచ్చే రుణాలు రూ.18,249 కోట్లు చూపించారు. ఇందులో రూ.3,000 కోట్లు అమరావతికి వచ్చే అప్పు! మిగిలినవి రహదారులు, విద్యా రంగానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలిచ్చే దీర్ఘకాలిక లోన్లు ఉన్నాయి. అప్పుల అసలు కోసం రూ.24,498.98 కోట్లు, వాటి వడ్డీల కోసం రూ.28,754.32 కోట్లు చెల్లించాలని పేర్కొన్నారు. పబ్లిక్ డెట్ రూ.5,60,094.25 కోట్లు. ఇది జీఎస్‌డీపీలో 34.14 శాతం. కార్పొరేషన్ల అప్పుల వివరాలు, వాటి వడ్డీల చెల్లింపుల వివరాలు బడ్జెట్లో చెప్పలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన అప్పులు రూ.1,54,797.11 కోట్లున్నాయి. ఇందులో విద్యుత్ రంగానికి సంబంధించినవి రూ.48,638.59 కోట్లు కాగా, మిగిలిన రంగాలు తెచ్చుకున్న గ్యారంటీ అప్పులు రూ.1,06,158.52 కోట్లున్నాయి.

**అంకెల్లో జాగ్రత్త....**

బడ్జెట్ తయారీలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించింది. ముఖ్యంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఆధారంగా బడ్జెట్‌ను నియంత్రించారు. ఆదాయానికి, ఖర్చుకు మధ్య వ్యత్యాసం తగ్గించడం కోసం వీలైనంత మేరకు బడ్జెట్ పరిమాణం కుదించినట్టు అర్థమవుతోంది. కేపిటల్ వ్యయం రూ.32,000 కోట్లుగా అంచనా వేశారు. ఇప్పటి వరకు చెల్లించిన బిల్లుల ఆధారంగా చూస్తే... ఈ అంచనాలు చేరుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అత్యధిక కేపిటల్ వ్యయం రూ.18,000 కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వం దీన్ని రెండింతలకు పెంచడం గమనార్హం. అలాగే, కేంద్రం నుంచి రూ.30 వేల కోట్ల గ్రాంట్లు వస్తాయని అంచనా వేశారు. గత ఏడాది రూ.34,500 కోట్లు వచ్చాయి. అయితే... 2014-15కి సంబంధించిన రెవెన్యూ లోటు గ్రాంటు రూ.10,500 కోట్లను కేంద్రం గత ఏడాది విడుదల చేయడంతో ఈ మొత్తం భారీగా పెరిగింది. ఈ ఏడాది అలాంటిది లేకుండానే... రూ.30,000 కోట్లుగా అంచనా వేయడం మంచి పరిణామమే!

**అంత ఆదాయం సాధ్యమేనా?**

రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో వచ్చిన ఆదాయం రూ.68,000 కోట్లు మాత్రమే. మిగిలింది ఆరు నెలల లెక్కలే. దీంతో... 2 లక్షల కోట్ల ఆదాయం సాధించడంపై అనుమానాలు నెలకొన్నాయి. ఇక... అప్పులు రూ.94 వేల కోట్లుగా చూపించారు. ఆదాయం అనుకున్నంత రాకపోతే... ఆ మేరకు అదనంగా అప్పులు తేవాల్సి ఉంటుంది.

**ఎందుకింత ఆలస్యం...**

పలు ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో... అసాధారణ రీతిలో నవంబరులో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడ్డాయి. 12వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. అప్పటికే అమలులో ఉన్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్... జూలై 31వ తేదీన ముగిసిపోయింది. సాధారణంగా కేంద్ర బడ్జెట్లోని కేటాయింపులు, ప్రాధాన్యాల ఆధారంగా రాష్ట్రాలు బడ్జెట్ రూపొందించుకుంటాయి. ఏపీ విషయానికొచ్చేసరికి అమరావతి, పోలవరం అత్యంత కీలకం. ఈ రెండు ప్రాజెక్టులను కేంద్రం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై స్పష్టత లేకుండా రాష్ట్ర బడ్జెట్ రూపొందించడం కష్టమని కూటమి సర్కారు భావించింది. పైగా జగన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ భ్రష్టుపట్టింది.

# తెలంగాణ ఏమీ కోల్పోలేదు



(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం అవుతుందా లేదా అన్న అనుమానాలున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ రెండూ దీనిపై పెద్ద ఆశలే పెట్టుకున్నాయి. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి ఆదర్శమవుతుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా చెబుతున్నారు. ఈ జోష్‌లోనే రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోడీకి సవాల్ విసురుతూ “ఇక కాచుకోండి” అంటూ ఓ ట్వీట్ కూడా చేశారు. రిజర్వేషన్లపై ఉన్న ఆంక్షలను కూడా బద్ధలు కొడతామని రాహుల్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.దేశంలో ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లు వాస్తవ పరిస్థితులకు దగ్గరగా లేవన్నది కాంగ్రెస్ భావన. రాజకీయ కోణం ఉండనే ఉంది. కులగణన వల్ల బలహీన వర్గాల వారికి మరింత లబ్ధి చేకూరుతుందని, సామాజిక, ఆర్థిక ప్రయోజనాలతోపాటు రాజకీయ అవకాశాలు కూడా ఎక్కువ అవుతాయని కాంగ్రెస్ ఆలోచన. ఇవన్నీ వినేందుకు బాగానే ఉన్నా సర్వే పూర్తి కావాలంటే మాత్రం ఎన్నో అవరోధాలను అధిగమించాల్సి ఉంటుందన్నది మాత్రం నిజం. ఇప్పటికే బీహార్‌లో కులగణన చేశారు. అయితే ఇది న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటోంది. ప్రత్యేకంగా ఒక చట్టం చేయకుండా కులగణన చేయడం వల్ల దానికి చట్టబద్ధత ఎలా వస్తుందన్నది ప్రశ్న. సర్వేలో అందే వివరాలు సమగ్రంగా ఉంటాయా? వాస్తవాలేనా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. పాలకులు మారినప్పుడల్లా ఇలాంటి కార్యక్రమాలు పెట్టడంవల్ల ప్రయోజనం ఎంతవరకు ఉంటుందన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సమగ్ర కుటుంబ సర్వే ఒకదాన్ని నిర్వహించారు. ఒకే రోజు రాష్ట్రమంతటా చేపట్టే ఈ సర్వేలో అందరూ కచ్చితంగా పాల్గొనాలని చెప్పడంతో అప్పట్లో జనాలు బాగా ఇబ్బంది పడ్డారు. దూర ప్రాంతాల్లోని వారు వేలకు వేలు ఖర్చుపెట్టుకుని సొంతూళ్లకు రావాల్సి వచ్చింది. అయితే ఆ తరువాత ఈ సర్వే ద్వారా సేకరించిన వివరాలు ఏమయ్యాయి అన్నది ఎవరికీ తెలియదు. ఎందుకు సర్వే చేశారు? అందిన సమాచారాన్ని ఎలా వాడారో ఎవరికీ చెప్పలేదు. దీంతో అదంతా వృథా ప్రయాసే అన్న అభిప్రాయం ఏర్పడింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నికల్లో తామిచ్చిన హామీల అమలుకుగాను.. ఆయా పథకాలను కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని ప్రజాపాలన కార్యక్రమం కింద కోరారు. ఇందుకో అధికశాతం మంది క్యూల్లో నిలవాల్సి వచ్చింది. దరఖాస్తులు పెట్టుకోవడానికి నానా పాట్లు పడ్డారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదు. దీని ప్రభావం కాస్తా ప్రస్తుతం జరుగుతున్న కులగణనపై పడుతోంది. ముందు అప్పటి సమాచారం సంగతేమిటో తెల్చమని కొందరు సర్వే అధికారులను నిలదీస్తున్నారు. అక్కడితో ఆగడం లేదు.


# వైఫల్యాలు, మోసాలపై నిలదీస్తామని పాలక పక్షానికి భయం: వైఎస్ జగన్

అమరావతి: ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, సూపర్ సిక్స్ మోసాలపై శాసనసభలో పాలకపక్షాన్ని నిలదీస్తామనే భయంతోనే 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీని ప్రతిపక్షంగా గుర్తించడం లేదని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి సర్కారు వైఫల్యాలను సభ వెలుపల ప్రభుత్వ సాక్ష్యాధారాలతో ఎండగట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. శాసన మండలిలో ప్రజాగళాన్ని గట్టిగా వినిపించి వైఫల్యాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఎమ్మెల్సీలకు సూచించారు. ప్రశ్నించే స్వరమే వినిపించకూడదనే ఆలోచనతో ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేసులు పెడతారని ఎవరూ భయపడవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం శాసన సభ్యులతో, మధ్యాహ్నం శాసన మండలి సభ్యులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోరుతూ కోర్టులో పిటిషన్ వేశాం. కానీ స్పీకర్ కోర్టు ఆదేశాలకు సమాధానం ఇవ్వలేదు. కోర్టు నుంచి వచ్చిన సమన్లు కూడా స్పీకర్ తీసుకోలేదు. అసెంబ్లీలో ఉన్న ఏకైక ప్రతిపక్షం మనమే. మనం మినహా మరో ప్రతిపక్షం లేదు. అయినా కూడా వారు మనల్ని ప్రతిపక్ష పార్టీగా గుర్తించడం లేదు. ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. అలా గుర్తిస్తే... ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడ్డానికి అవకాశాలు ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే వారు ముందుకు రావడం లేదు. సభా నాయకుడికి మాట్లాడటానికి ఎంత సముయం ఇస్తారో.. ఆ తర్వాత అంతే హక్కుగా ప్రతిపక్ష నాయకుడికి కూడా సమయం ఇవ్వాల్సి వస్తుందేమోనని, ఇవ్వక తప్పని పరిస్థితులు వస్తాయనే విషయాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నాయకుడిగా అంగీకరించడం లేదు. 40 శాతం ఓట్ షేర్ సాధించిన పార్టీని ప్రతిపక్షపార్టీగా గుర్తియిచడానికి ఇష్టపడని పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైకోర్టులో మనం వేసిన పిటిషన్‌పై కౌంటర్ వేయడానికి కూడా స్పీకర్ సుముఖంగా లేరు. అందుకే మన ఎమ్మెల్యేలు తమ గళాన్ని మీడియా వేదికగా ప్రజలకు వినిపించాలి.ప్రతి రోజూ మన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు మీడియా ద్వారా మాట్లాడతారు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తారు. అసెంబ్లీలో ఏ మాదిరిగా ప్రశ్నలు వేస్తామో, అదే రీతిలో ఇక్కడ నుంచి అధికార పక్షాన్ని ప్రశ్నిస్తాం. పూర్తి వివరాలు, ఆధారాలు, సాక్ష్యాలతో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ఈ వివరాలన్నింటినీ శాసన మండలి సభ్యులు ప్రతి ఒక్కరికీ పంపిస్తాం.

# సీజేఐగా జస్టిస్ ఖన్నా

సంజీవ్ ఖన్నా ఆంగ్లంలో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రాం మేఘ్వాల్ , మనోహర్ లాల్ ఖట్టర్, కిరెన్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరి, ఏపీ గవర్నర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అబ్దుల్ నజీర్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. జస్టిస్ ఖన్నా వయసు 64 ఏళ్లు. 1960 మే 14న ఆయన జన్మించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ వయసు 65 ఏళ్లు. అంటే ఆయన 2025 మే 13 వరకు పదవిలో కొనసాగుతారు. 2019 జనవరి 18న జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని, ఆర్టికల్ 370 రద్దు సహేతుకమేనని, ఈవీఎంలలో లోపాలేమీ లేవని ప్రకటించిన వివిధ ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఆయన బెయిల్ ఇచ్చారు. ఢిల్లీ యూనివర్సిటీలో లా చదివిన ఖన్నా హైకోర్టు న్యాయమూర్తి కాకముందు అనేక సంవత్సరాలు న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. ఆయన ప్రఖ్యాత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్‌ఆర్ ఖన్నా సోదరుడి కుమారుడు. ప్రాథమిక హక్కులను రద్దు చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని హెచ్‌ఆర్ ఖన్నా ప్రకటించిన విషయం తెలిసిందే. జస్టిస్ సంజీవ్ ఖన్నా తండ్రి దేవ్‌రాజ్ ఖన్నా గతంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, నూతన సీజేఐ సంజీవ్ ఖన్నాకు ‘ఎక్స్’ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. కాగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి విపక్షనేత రాహుల్ గాంధీ గైర్హాజరయ్యారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నాకు పెద్దనాన్న. ఓ కేసులో తనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని అప్పటి ప్రధాని ఇందిర.. హెచ్‌ఆర్ ఖన్నాకు సీజేఐ పదవి ఇవ్వరాదని పట్టుబట్టి అనుకున్నది సాధించారు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కులపై నాటి ప్రధాని ఇందిర ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఏడీఎం జబల్పూర్ వర్సెస్ శివకాంత్ సుక్లా వాజ్యం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ‘ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కులను హరించివేయడం సబబేనా?’ అన్నది ఈ వ్యాజ్యం సారాంశం. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా.. ఇందిర నిర్ణయాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు.

# శబరిమల యాత్రికులలకు ఆరోగ్య సలహా


**శ్రీనివాస్ (డైలీ రిపోర్ట్) ప్రతినిధి రంగారెడ్డి జిల్లా/శంకర్ పల్లి:** అధిక రక్తపోటు , మధుమేహం , గుండె జబ్బులు మరియు ఉబ్బసం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మొదట వారి వైద్యుల నుండి సలహా తీసుకోవాలి , అయితే గుండె సంబంధిత వ్యాధుల చరిత్ర ఉన్నవారు తీర్థయాత్రకు ముందు గుండె పరీక్ష చేయించుకోవాలి.

**గుర్తుంచుకోవలసిన విషయాలు:**

పర్వతం ఎక్కడం కష్టంగా ఉంటే నీలిమల మార్గాన్ని నివారించండి మరియు స్వామి అయ్యప్పన్ రహదారిని ఎంచుకోండి , నెమ్మదిగా కొండపైకి ఎక్కండి మరియు క్రమం తప్పకుండా విశ్రాంతి తీసుకోండి.మీరు ఎక్కేటప్పుడు అలసట , బలహీనత , ఛాతీ నొప్పి లేదా శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు ఉంటే భోజనం చేసిన వెంటనే పర్వతాన్ని ఎక్కకండి , వీలైనంత త్వరగా ఆపి వైద్య సహాయం తీసుకోండి.04735203232 నంబర్‌కు డయల్ చేసి అత్యవసర వైద్య సహాయం కోసం గుండె పరీక్ష మరియు చికిత్స పంబ , నీలిమల , అపాచిమేడు మరియు సన్నిధానం ఆసుపత్రులలో ఎక్కేటప్పుడు ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే అందుబాటులో ఉంటుంది.ట్రయల్ వెంట పనిచేసే అత్యవసర వైద్య కేంద్రాల నుండి వైద్య సహాయం పొందవచ్చు. తీర్థయాత్ర సమయంలో ఇప్పటికే ఉన్న అనారోగ్యాల ఆసుపత్రి రికార్డులు , మందుల ప్రిస్క్రిప్షన్లు మరియు ఆరోగ్య బీమా పత్రాలను తీసుకెళ్లండి. శబరిమలకు వార్షిక తీర్థయాత్ర చేపట్టే భక్తులకు ఆరోగ్య సలహా జారీ చేయబడింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని మరియు వారి వైద్య రికార్డులతో పాటు బీమా పత్రాలను తమ వెంట తీసుకెళ్లాలని కోరారు. యాత్రికులు తమ ఆరోగ్య పరిస్థితులపై శ్రద్ధ వహించాలని మరియు కొండ పుణ్యక్షేత్రాన్ని సందర్శించే ముందు శారీరక మరియు మానసిక సన్నాహాలు తీసుకోవాలని కేరళలోని పతనంతిట్టా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎల్ అనిత కుమారి తెలిపారు. పర్వతారోహణ సమయంలో తలెత్తే అనారోగ్య సమస్యలను నివారించడానికి , దర్శనానికి బయలుదేరే కొద్ది రోజుల ముందు తేలికపాటి వ్యాయామాలు , చురుకైన నడకతో సహా , ఉపవాస సమయంలో సాధారణ మందులు నిలిపివేయరాదని వైద్యాధికారి సలహా ఇచ్చారు.

## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ బోర్డు సభ్యుడు కే శివకుమార్ దంపతులు

### కే శివకుమార్ కు తిరుమల ఎస్వీ గో సంరక్షణ శాల నుండి ఆహ్వానం




శంకర్‌పల్లి నవంబర్ 11:(డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ బోర్డు సభ్యుడు కే శివకుమార్ దంపతులు స్వామి వారికి కార్తీక మాసం రెండవ సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకం చేసి, స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆల్ ఇండియా చైర్మన్ దయాకర్ రాజు స్వామి కే శివకుమార్ దంపతులను స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి, ఆశీస్సులు అందజేశారు. శ్రీవారి కైంకర్యాలకు, నైవేద్యాలకు, లడ్డూ ప్రసాదం తయారీకి టీటీడీ ఆధ్వర్యంలో లక్ష దేశీ గోవులతో గోవిందుని గో మహాధామం నిర్మించాలని కోరుతూ టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు, యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్ కె. శివకుమార్ చేసిన విజ్ఞప్తికి టీటీడీ ఎట్టకేలకు స్పందించింది. ఈ నెల 25వ తేదీన టీటీడీ జేఈవోతో సమావేశమై ప్రాజెక్టుకి సంబంధించిన పూర్తి వివరాలు అందించాల్సిందిగా డైరెక్టర్, ఎస్వీ గో సంరక్షణశాల, తిరుపతి నుండి అధికారిక ఆహ్వానం అందింది. గోవిందుని గో మహాధామం నిర్మాణం పై టీటీడీ తొలి అడుగు వేయడాన్ని ఆనందంగా స్వాగతిస్తున్నామని, గోవిందుని అనుగ్రహంతో కోట్లాది శ్రీవారి భక్తుల ఆకాంక్షలు నిజం చేస్తూ గోవిందుని గో మహా ధామం నిర్మించబడుతుందని కె. శివకుమార్ తెలియజేశారు. మధ్యాహ్నం మరకత శివాలయాన్ని దర్శించుకోగానే, సాయంత్రం తిరుమల నుండి పిలుపు రావడం పట్ల అనుకున్న కోరిక నెరవేరిందని కే శివకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.



## గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షులుగా బోధన బోయిన అరుణ్ యాదవ్ నియామకం



**గిద్దలూరు ,నవంబర్11 (డైలీ రిపోర్ట్):** ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్ కుమారుడు బోధన బోయిన అరుణ్ కుమార్ యాదవ్ శ్రీశైలంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ .లాక వెంగళరావు యాదవ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు పత్రం అందుకోవడం జరిగింది.గత ఐదు సంవత్సరాల నుంచి బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ స్థాయిలోనూ అనేక బీసీ సమస్యలపై పని చేస్తూ సంఘాన్ని పటిష్ట పరుస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో బీసీ సంఘం నిర్మాణానికి మరింత ప్రతిష్ట పరిచి విస్తృత పరిచేందుకు బీసీ సంఘల మధ్య మరింత ఐక్యతను పెంచేందుకు కృషి చేస్తానని బోధన బోయిన అరుణ్ కుమార్ యాదవ్ తెలియజేశారు.



## అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా శంకర్‌పల్లి వాసి

**శంకర్‌పల్లి: నవంబర్ 11: (డైలీ రిపోర్ట్):** తెలంగాణ గవర్నమెంట్ టీజీపి ఎస్ సి నిర్వహించిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పరీక్షలో ఎంపిక కాబడి సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హైదరాబాదులో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ట్రాన్స్ పోర్ట్ భవన్ లో ఏఎంవిఐ నియామక పత్రాన్ని శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని హనుమాన్ నగర్ కి చెందిన మాల కిరణ్ కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాల బాలయ్య, విజయలలిత, కుటుంబ సభ్యులు రమ్య, శ్రీధర్ బంధుమిత్రులు పెంటయ్య, శంకరయ్య, మర్పల్లి అశోక్, నర్సింలు, రాములు, మాజీ ఎంపీపీ నర్సింహులు, మాజీ ఎంపిటిసి బిసోల్ల అశోక్ కుమార్, మాజీ సర్పంచ్ బిసోల్ల శ్రీధర్, స్నేహితులు, కాలనీవాసులు అభినందనలు తెలిపారు. గత నెలలో గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా నియామకమై మేడ్చల్ జిల్లాలో విధులు నిర్వహిస్తూ, మళ్లీ నెల రోజుల వ్యవధిలోనే అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా మరో ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తన బిడ్డ పట్టుదలకు, శ్రమకు, వినయ, విధేయతలకు ఎంతగానో గర్వపడుతూ బంధుమిత్రులతో వారి సంతోషాన్ని పంచుకున్నారు.






## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో పోటెత్తిన భక్తులు

**శంకర్‌పల్లి నవంబర్ 11:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల చందిప్ప గ్రామ 11వ శతాబ్దపు శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం పురస్కరించుకొని భక్తులు వేకువజాము నుంచే ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామి దర్శనం కొరకు క్యూలైన్లో భక్తులు గంటల తరబడి వేచి ఉన్నారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు సాయిశివ మాట్లాడుతూ కార్తీక మాసం మహాశివునికి పవిత్రమైన రోజులుగా భావిస్తారని, సోమవారం భారీగా భక్తులు దర్శించుకుంటున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



## శంకర్‌పల్లి: సింగాపురంలో ఊరేగింపుగా మహిళల బోనాలు




**శంకర్పల్లి నవంబర్ 11:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి సింగాపురంలో సోమవారం ( బొడ్రాయికి) మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. మహిళలు బోనాలతో కాలనీల్లో తిరుగుతూ ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు చేరుకున్నారు. బోనాలతో తరలి వచ్చిన మహిళలతో, భక్తులతో సింగాపురంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు తమ ఇష్ట దైవానికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, నాయకులు బొడ్రాయిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు.

# ఇచ్చోడ జనరిక్ ఔషధాలు పేదవాడికి తక్కువ ఖర్చుతో మందులు అందించే ఔషధాలు జనరిక్ మెడికల్..!!



**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** అదిలాబాద్ జిల్లా స్థానిక ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రస్తుతం ఆస్పత్రికి వెళితే మెడిసిన్ బిల్లు తడిసి మోపెడవుతుంటుంది. చిన్నపాటి అనారోగ్య సమస్య ఉన్నా.. మందుల కోసం వందల్లో ఖర్చు అవుతుంటుంది. బ్రాండెడ్ మందుల ధరలు విపరీతంగా ఉండటంతో సామాన్యులకు సైతం ఇబ్బందిగా మారిన పరిస్థితి ఉంటుంది. ఈ..ప్రస్తుతం ఆస్పత్రికి వెళితే మెడిసిన్ బిల్లు తడిసి మోపెడవుతుంటుంది. చిన్నపాటి అనారోగ్య సమస్య ఉన్నా.. మందుల కోసం వందల్లో ఖర్చు అవుతుంటుంది. బ్రాండెడ్ మందుల ధరలు విపరీతంగా ఉండటంతో సామాన్యులకు సైతం ఇబ్బందిగా మారిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరల్లో మందులు అందే విధంగా కేంద్ర ప్రభుత్వం జనరిక్ మందులను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే వైద్యులు జనరిక్ మందులను రాయకుండా బ్రాండెడ్ మందులను రాస్తున్నారు. దీంతో రోగులకు ఖర్చులు మరింతగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆస్పత్రులు, సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ కేంద్రాల్లోని వైద్యులు తమ వద్దకు వచ్చే పేషెంట్లకు చౌకగా లభించే జనరిక్ మందులనే రాయాలని కేంద్రం సూచించింది. ఇలా జనరిక్ మందులను రాయకుండా బయట బ్రాండెడ్ మందులను రాసినట్లయితే చర్యలు కఠినంగా ఉంటాయని కేంద్రం హెచ్చరించింది. అంతేకాకుండా ఆస్పత్రులకు మెడికల్ రిప్రజెంటేటివ్‌ల రాకపోకలను తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు హెల్త్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ ఈ నెల 12న అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు.

### బ్రాండెడ్ మందులపై పెద్ద ఎత్తున కమీషన్లు

కాగా, బ్రాండెడ్ మందులు రోగులకు రాస్తే ఆయా ఫార్మా కంపెనీలు వైద్యులకు పెద్ద ఎత్తున కమీషన్లు ముట్టజెబుతున్నాయని ఆరోపణలున్నాయి. ఈ కారణంగా వారు తక్కువ ధరకు లభించే మందులను ప్రోత్సహించడం లేదని కూడా ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. భారతీ వైద్య విధాన మండలి సైతం జనరిక్ మందులను మాత్రమే రాయాలని పదేపదే హెచ్చరిస్తున్నా.. రాయడం లేదు. అయితే ఈ జనరిక్ మందులను రాస్తే రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. బ్రాండెడ్ మందులతో పోలిస్తే ఈ జనరిక్ మందులు దాదాపు 70 నుంచి 80 శాతం వరకు ఖర్చు తగ్గుతుంది.




### బ్రాండెడ్-జనరిక్‌ల మధ్య తేడా ఏమిటి?

అయితే బ్రాండెడ్, జనరిక్ మందుల్లో ఉండేది ఒకే రకరమైన ఔషధమే. ఈ రెండింటి మెడిసిన్‌లో ఎలాంటి తేడా ఉండదు. బ్రాండెడ్ మందులకు ఉత్పత్తి ఖర్చుతో పాటు డీలర్, హోల్‌సేల్, రిటైల్‌ల లాభాలు, వైద్యుల కమీషన్లు అందులోనే ఉంటాయి. అందుకే వీటి ధర అధికంగా ఉంటుంది. అదే జనరిక్‌లో అలాంటివేమి ఉండవు. అందుకే తక్కువ ధరల్లో లభిస్తాయి.

### జనరిక్ మందులు నాణ్యమైనవేనా?

జనరిక్ అయినా బ్రాండెడ్ అయినా తయారీ నాణ్యత, పనితీరు ఒకే విధంగా ఉంటాయి. తయారీలోనూ, మార్కెటింగ్‌లోనూ అదనపు ఖర్చు ఉండదు కాబట్టే తక్కువ ధరల్లో లభించేందుకు సాధ్యపడుతుంది. కాలపరిమితి ముగియటంతో మొదటి ఉత్పత్తిదారుడు పేటంట్ రైట్ కోల్పోవటంతో ఇతరులు వీటిని తయారుచేస్తారు. దీర్ఘకాలిక రోగాలకు 'జనరిక్' ఔషధాలు చాలా బాగా ఉపయోగపడతాయి. కానీ ఖరీదైన మందులకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. తక్కువ ధరే అయినా, ప్రజలు జనరిక్ మందుల వైపు వెళ్లడం లేదు. అందుకే వీటి వాడకాన్ని పెంచేందుకు కేంద్రం చర్యలు చేపడుతోంది. బయట మార్కెట్ రూ. 20కు దొరికే టాబ్లెట్ జనరిక్ మెడిసిన్ కేవలం రూ. 8 లభిస్తుంది.



# పెళ్లి ఇంట విషాదం

## కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు... నవ వధువు సోదరుడు, స్నేహితురాలు మృతి



జగిత్యాల: ఆర్టీసీ బస్సు కారు ను ఢీకొన్న సంఘటనలో నవవధువు సోదరుడు, ఆమె స్నేహితురాలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం వేకువజామున జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన వలిపిరెడ్డి రాజమల్లు, లక్ష్మి కూతురు సంఘవి పెళ్లి ఈనెల 8న జనగామకు చెందిన ఓ యువకుడితో హన్మకొండలో జరిగింది. శనివారం రాత్రి రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న సంఘవి సోదరుడు సంకీర్తన్ (30), హైదరా బాద్‌లో సంఘవితో కలిసి పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా నారాయణవనంకు చెందిన సాధు మునిరాజీ (25)తోపాటు తల్లి లక్ష్మి, తండ్రి రాజమల్లు కారులో జగిత్యాలకు వస్తున్నారు. ధరూర్ సమీపంలోకి రాగానే జగిత్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు వీరి కారును ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో సంకీర్తన్‌తోపాటు మునిరాజీ అక్కడికక్కడే చనిపోయారు. లక్ష్మి, రాజమల్లు పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ సీఐ వై. కృష్ణారెడ్డి, ఎస్సై సుధాకర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సంకీర్తన్ మేనమామ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పెళ్లైన రెండురోజులకే సోదరుడితో పాటు స్నేహితురాలు మృతి చెందడంతో సంఘవి తీవ్రంగా రోదించింది. గాయాలతోనే ఉన్న తండ్రి రాజమల్లు సంకీర్తన్ చితికి నిప్పంటించడం స్థానికులను కలచివేసింది.



# రావులపల్లి కలాన్ గ్రామానికి వైకుంఠ రథం అందజేత

**శంకర్‌పల్లి: నవంబర్ 11: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన వానరాసి క్రిష్ణమూర్తి వారి నాన్న, నానమ్మ జ్ఞాపకార్థంగా రావులపల్లి కలాన్ గ్రామ పంచాయతీకి వైకుంఠ రథం డొనేట్ చేశారు. సోమవారం ఈ వైకుంఠ రథం ప్రారంభోత్సవానికి చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకుడు బద్దం కృష్ణరెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, పర్వేద ఎంపీటీసీ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707